'పట్టణ అభివృద్ధిపై కాంగ్రెస్ కక్ష'

నర్సంపేట, నవంబర్ 21: నర్సంపేట పట్టణ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష కట్టిందని ఒకటో వార్డు కౌన్సిలర్ దేవోజు తిరుమలా సదానందం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఒకటో వార్డు అభివృద్ధికి రూ. 1.60 కోట్ల నిధులు కేటాయించారని, వాటిని కూడా రద్దు చేశారని విమర్శించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సంగెం, నవంబర్ 21: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం ఉదయం పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు సత్తుపల్లి దినేశ్, ఎండీ దాదాసాహబ్, మిల్లి పాక సారంగపాణిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మట్టెవాడ, నవంబర్ 21: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిన్నవారివీధిలో గుట్కాలు విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ ఏసీబీ మధుసూదన్ ఆదేశాల మేరకు దాడులు చేశామన్నారు. పిన్నవారివీధిలో గబ్బర్‌సింగ్ కిరాణా షాపు, కృష్ణమూర్తి గోదాంలో నిల్వ ఉంచిన రూ. 3.72 లక్షల గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కొబ్బరికాయల విక్రయానికి వేలం

గీసుగొండ, నవంబర్ 21: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కట్టమల్లన్న (శ్రీ మల్లికార్జునస్వామి) ఆలయంలో కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర ప్రసాదం, స్వీట్స్, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు ఈ నెల 25న వేలం వేయనున్నట్లు ఈవో నాగేశ్వర్ రావు తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వరంగల్ ములుగురోడ్డులోని కార్యాలయంలో జిల్లా కమిటీతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి పాల్గొన్నారు. అంతేకాకుండా నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, రాయపర్తి, ఖిలావరంగల్, దుగ్గొండి, సంగెం, పర్వతగిరి మండలాల్లో మత్స్య సహకార, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు జెండాలు ఆవిష్కరించారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, శ్రీ అర్జుల సంపత్‌రెడ్డి, తండ్రి: రాంచంద్రారెడ్డి గారు ఈ దిగువ చూపబడిన ఆస్తిని తనఖాగా పెట్టి రుణం కొరకు HDFC Bank, Hanumakonda Branch వారిని సంప్రదించినారు. ఈ దిగువ చూపబడిన ఆస్తికి సంబంధించిన లింకు దస్తావేజు అనగా రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం. 739/1983 అమ్మినవారు తోటం మెట్‌రాములు మరియు ఇతరుల తరపున వారి జి.పి.ఏ. హోల్డర్ కిషన్‌రావు, కొన్నవారు గుండా సోమయ్య ఇట్టి దస్తావేజు పోయినవని తెలిపినారు. కావున, ఇట్టి లావాదేవీలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోగా ఈ దిగువ చూపబడిన అడ్రస్‌కు తెలియజేయగలరు. సకాలంలో ఎలాంటి అభ్యంతరాలు రానిచో HDFC Bank, Hanumakonda Branch వారు వారి నియమ నిబంధనల ప్రకారం ఆట్టి ఆస్తిని తనఖాగా పెట్టుకొని శ్రీ అర్జుల సంపత్‌రెడ్డి గారికి రుణం మంజూరు చేయుటకు నిర్ణయం తీసుకోగలరు.

ఆస్తి షెడ్యూల్: హన్మకొండ జిల్లా, హన్మకొండ మండలం, ఎక్సైజ్ కాలనీలోని గృహం నెం. 2-7-513/3, దీని యొక్క సర్వే నెం. 49 & 46 (పాత‌ది), 442 & 443 (కొత్త‌ది), దీని యొక్క విస్తీర్ణం 366.25 చ.గజాలు. ఇందుకు హద్దులు: తూర్పు: పి.జయగారి ఖాళీ స్థలం, పడమర: ఎం.కవిత గారి గృహం, ఉత్తరం: 30 ఫీట్ల రోడ్, దక్షిణం: ఎం.మాధవరావు ఇం.నెం. 2-7-510/1 & ఎ.దామోదర్‌రావు ఇం.నెం. 2-7-511.

Sd/- B.B. PRASAD, Advocate
1-7-840/206, Lahari Bharathi Apartments, Hunter Road, Opp: Warangal Public School, Hanumakonda, **Cell: 9849558583.**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

*I, **MUDIDE RAJITHA** (New Name), previously called **MUDIDE RAJITA** (Old Name), and residing at H.No. 6-6-9/D, Saraswathi Nagar Road Number-3, Sai Nagar Colony, Gopalpur, Hanamkonda Mdl., Hanumakonda District-506009, T.G., India, and solemnly declare.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివాంచు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

144 సెక్షన్‌తో పాలన నడపలేరు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, నవంబర్ 21: రాష్ట్రంలో 144 సెక్షన్‌తో పాలనను నడపలేరని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల విశ్వాసం కోల్పోయిందని ఎద్దేవా చేశారు. లగచర్ల బాధితులకు అండగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన సభకు అనుమతి నిరాకరించడం ముఖ్యమంత్రి నియంత పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యుల కోసం పేద గిరిజన, దళితుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. గిరిజన ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిపై ఉక్కుపాదం మోపడం కాంగ్రెస్‌కు వెన్నెతో పెట్టిన విద్య అని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానుకోటలో చేపట్టే శాంతి యుత కార్యక్రమానికి అనుమతి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సంగెం, నవంబర్ 21: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకులు తిరుమల, స్వప్న అన్నారు. మొండ్రాయి, షాపురంలోని గ్రామైక్య సంఘాల మహిళలకు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖీ సెంటర్ ద్వారా బాధితులకు కౌన్సెలింగ్, పోలీసు, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర సమయంలో 100, 181, 1098, 14567 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు కుర్చీలు అందించిన ఇన్నర్‌వీల్ క్లబ్

నెక్కొండ, నవంబర్ 21: సూరిపల్లి జడ్పీహెచ్ఎస్, జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన దొమ్మటి అనిత, మూడు జానకిలకు పదో తరగతితోపాటు ఉన్నత చదువుకు ఆర్థిక సాయం అందజేస్తామని ఇన్నర్‌వీల్ క్లబ్ ఫౌండర్ నేరెళ్ల శోభావతి, క్లబ్ అధ్యక్షురాలు నంబూరి లావణ్య, సెక్రటరీ రేణుక తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా సూరిపల్లి పాఠశాల నుంచి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొని తృతీయ స్థానం సాధించిన దొమ్మటి అనిత, మూడు జానకీకి బెడ్స్, ట్రంక్ బాక్స్‌లు, ప్లేట్లు, గ్లాసులు, స్పోర్ట్స్ షూ అందించారు. అలాగే, పాఠశాలకు 30 కుర్చీలు సమకూర్చారు.

మేయర్‌ను కలిసి బల్దియా కాంట్రాక్టర్లు

వరంగల్, నవంబర్ 21: నూతనంగా ఎన్నికైన బల్దియా సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గురువారం మేయర్ గుండు సుధారాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పూజరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, కోశాధికారి మధుసూదన్, ఉపాధ్యక్షులు మేకల రమేశ్, దూకుడు సోమయ్య, సిలివేరు కోటేశ్వర్, బొంత సోమయ్య, ఒర్సు ఎల్లయ్య, సలహాదారు గోల్కొండ సాంబయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

26న సమ్మెను విజయవంతం చేయాలి

కాశీబుగ్గ, నవంబర్ 26: ఈ నెల 26న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను కిసాన్ మోర్చా, రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. రాజకీయాలకతీతంగా ఉద్యమాలు చేసి పాలకుల మెడలు వంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేశ్, శంకరయ్య, శ్రీనివాస్, బాలరాజు, గోనె కుమారస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

వర్ధన్నపేట/ఖానాపురం, నవంబర్ 21: రాష్ట్రంలోని ముదిరాజ్‌ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఇల్లందలో ఆయన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, జిల్లా బాధ్యులు పోలు అమర్‌చంద్, అనురాధ, సుంకరి సాంబయ్య, పిట్టల భాస్కర్, కుమారస్వామి, కొండ ఉప్పలయ్య, సుంకరి స్వామి, సుభాష్, భీమ్‌రాజ్, భిక్షపతి, సోడెం నాగయ్య పాల్గొన్నారు. ఖానాపురం మండలం రాగంపేటలో జరిగిన ముదిరాజ్ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, రాజ్‌కుమార్, ఐలేశ్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి

మహిళల అభివృద్ధికి సర్కారు కృషి

నర్సంపేట, నవంబర్ 21: మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు స్వయం ఉపాధి కోర్సులను వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మాదన్నపేటకు చెందిన 35 మందికి ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పావని, జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, సుజాత, వీవో అధ్యక్షురాలు వీణ పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్లతో సీఐల సమీక్ష

ఖిలావరంగల్/దుగ్గొండి, నవంబర్ 21: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బ్యాంకుల మేనేజర్లతో గురువారం మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం సమీక్షించారు. ఇటీవల రాయపర్తిలోని ఎస్‌బీఐలో జరిగి దోపిడీని దృష్టిలో పెట్టుకొని మరే ఇతర బ్యాంకుల్లో దొంగతనం జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ వారికి సూచించారు. సీసీ కెమెరాలతోపాటు అలారం పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే, సెక్యూరిటీ సిబ్బందిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. దుగ్గొండిలోని ఎస్‌బీఐని సీఐ సాయిరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్‌తో కలిసి కార్యాలయంలో సీసీ కెమెరాలు, లాకర్స్, అలారం లాకర్స్‌తో పాటు బ్యాంకు పరిసరాలను పరిశీలించారు.

మైక్రోయాక్షన్ ప్లాన్‌పై శిక్షణ

గిర్మాజీపేట, నవంబర్ 22: నూతనంగా సవరించిన రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో వ్యాక్సిన్ ఇచ్చే రూట్స్, డోసుల కొత్త వివరాలపై, వ్యాక్సిన్ ఇచ్చే ప్రదేశాలు ఎంచుకోవడంపై మైక్రోయాక్షన్ ప్లాన్ ఎలా తయారు చేసుకోవాలో డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు వైద్యాధికారులకు గురువారం తన కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవలపై వివరించే హ్యాండ్‌బుక్స్‌ను డీఎంహెచ్‌వో ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ టీం ప్రతినిధి మురహరి, అతుల్, జ్యోత్స్న, డేవిడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, మోహన్‌సింగ్, సూపర్‌వైజర్లు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా ధాన్యం కొనాలి

- 20 రోజుల క్రితమే ప్రారంభమైన వరి కోతలు
- వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెంటర్ల పరిశీలన

మంగళవారిపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపురం, నవంబర్ 21: ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధరావుపేట, మంగళవారిపేటలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పాకాల ఆయకట్టులో 20 రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభమైనట్లు తెలిపారు. మంగళవారిపేట, బుధరావుపేటలో రైతులు 15 రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారన్నారు. ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభిం చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యంలో తేమ శాతం గణనీయంగా తగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బరువు తగ్గే ప్రమాదం ఉందన్నారు. సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వాల్సి వస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు పెడుతున్నదని విమర్శించారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు కాసప్రవీణ్‌కుమార్, లావుడ్యా రమేశ్, వల్లెపు సోమయ్య, భూక్యా పద్మావతి వెంకన్న, సొసైటీ డైరెక్టర్ ఆబోత్ అశోక్, వేల్పుల లింగయ్య, తొట్ల వెంకటేశ్వర్లు, నాగార్జునరెడ్డి, మురళి, కృష్ణారెడ్డి, బాలూ నాయక్, రామ్మూర్తి, యాదగిరి, నర్సయ్య, వెంకన్న, మోతీలాల్ పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

టీజీవో నూతన కార్యవర్గాల ఎన్నిక

హనుమకొండ, నవంబర్ 21: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల నూతన కార్యవర్గాలను గురువారం హనుమకొండ ఐడీవోసీ ప్రాంగణంలోని టీజీవో భవన్‌లో ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు టీజీవో సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీ జాక్ సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, సహ అధ్యక్షుడు బీ శ్యామ్, ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఏ జగన్మోహన్‌రావు, కోశాధికారి ఎం ఉపేందర్‌రెడ్డి, దీపారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారులుగా ఉపేందర్‌రెడ్డి, ఈగ వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా ఎన్నికల అధికారులుగా మురళీధర్‌రెడ్డి, నాగా నారాయణ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన రెండు జిల్లాల కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడిగా జీ రాంరెడ్డి, సెక్రటరీగా పీఎస్ ఫణికుమార్, ట్రెజరర్‌గా ఇ వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కే అనురాధ, ఉపాధ్యక్షులుగా ఎం చంద్రశేఖర్, డాక్టర్ బీ రాజేశ్‌రెడ్డి, ఎం నీరజ, జే విజయ సారథి, డాక్టర్ బీ సుధీర్ గౌడ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పీ భాగ్యలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా పాక శ్రీనివాసులు, కే రాజు, సీహెచ్ యాకయ్య, బీ మధుసూదన్‌రెడ్డి, ఎన్ రవీందర్‌రెడ్డి, మహిళా జాయింట్ సెక్రటరీగా కే మధురిమ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డీ సాయిరాజ్, బీ రవి, పబ్లిసిటీ సెక్రటరీలుగా డాక్టర్ జీ రాజేశ్వర్ కుమార్, వీ సదానందం, ఆఫీస్ సెక్రటరీలుగా ఏ రాంచందర్‌రావు, డాక్టర్ మైదం రాజు, కల్చరల్ సెక్రటరీలుగా బీ సతీశ్ కుమార్, పీ శ్రీకాంత్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీగా జీ సుధీర్‌కుమార్, ఎండీ ఇస్మాయిల్, ఈసీ మెంబర్లుగా బీ విజయ నిర్మల, బింగి హేమలత, కే శ్రీధర్, డాక్టర్ ఎస్ శ్రీలక్ష్మి, పీ పవిత్ర ఎన్నికయ్యారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

వర్ధన్నపేటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వర్ధన్నపేట/రాయపర్తి, నవంబర్ 21: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్నదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ అన్నారు. ఈ నెల 27, 28న ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ చేపట్టనున్న మహా పాదయాత్ర పోస్టర్లను మండలకేంద్రంలో గురువారం ఫోరం మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత ఆవిష్కరించారు. అలాగే, పాదయాత్రను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ కోరారు. రాయపర్తిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గిట్టుబాటు ధర లేక రైతులకు నష్టాలు

రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 21: దేశానికి తిండి పెట్టడానికి అవిశ్రాంతంగా సేవ చేస్తున్న రైతులు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నారని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. వరంగల్ 27వ డివిజన్ పరిధిలోని అబ్బనికుంట తెలంగాణ రైతు భవన్‌లో గురువారం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటనారాయణ, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు, రైతు సంఘం నాయకులు ఓదెల రాజయ్య, కుసుంబ బాబురావు, సోమ రామ్మూర్తి, హంసాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆపరేటర్‌కు గాయాలు

విద్యుత్ ఉన్నతాధికారుల తప్పిదమే కారణమా..?

కృష్ణను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

నర్సంపేటరూరల్, నవంబర్ 21: విద్యుదాఘాతంతో ఓ ట్రాన్స్‌కో ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామ శివారులోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సంగెం మండలం పల్లారుగూడకు చెందిన గుగులోత్ కృష్ణ ఆర్టిజన్ గ్రేడ్-1 ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం కృష్ణ విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం కృష్ణతోపాటు మరో వ్యక్తి ఫీడర్-1ను ఎల్‌సీ తీసుకొని ఇదే సబ్‌స్టేషన్‌లో బ్రేకర్‌పై నిలబడి పెయింటింగ్ వర్క్ చేస్తున్నాడు. ఈ క్రమంలో లైవ్‌లో ఉన్న మరో ఫీడర్ విద్యుత్ వైర్ కృష్ణకు తాకడంతో మంటలు చెలరేగి 55 శాతం శరీరం కాలిపోయింది. గమనించిన తోటి సిబ్బంది కృష్ణను అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉంటే.. బ్రేకర్ల పెయింటింగ్ పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. కానీ, లక్నేపల్లిలో ఆపరేటర్లతోనే ఉన్నతాధికారులు పనులు చేయిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటన బయటకు పొక్కకుండా ఉద్యోగులు జాగ్రత్త పడ్డారు. కానీ, నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీయడంతో అసలు విషయం బయటకొచ్చింది. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

టీజీవో జిల్లా కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి

గీసుగొండ, నవంబర్ 21: గీసుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి టీజీవో జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వరంగల్‌లో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, నవంబర్ 22: గ్రూప్-2 సర్వీసెస్ పరీక్ష కోసం రెండు ప్రీ ఫుల్‌లెంగ్త్ మాక్ టెస్టులను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు పరీక్షకు హాజరయ్యే ఆసక్తిగల మైనార్టీ యువత నుంచి ఈ నెల 29లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టీ రమేశ్ తెలిపారు. వివరాలకు 0870-2980533 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గిరిజన జర్నలిస్టులకు శిక్షణ

ఖిలావరంగల్, నవంబర్ 21: తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల గిరిజన వర్కింగ్ జర్నలిస్టులు తమ పేర్లను ఈ నెల 23 సాయంత్రం 5 గంటల్లోగా వరంగల్ డీపీఆర్వో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

రాయపర్తిలో అగ్ని ప్రమాదం

రాయపర్తి, నవంబర్ 21: మండలకేంద్రంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. రిటైర్డ్ ఉపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు కొండూరు రోడ్డులోని తన ఇంట్లో డ్రిప్ పైపులను నిల్వ చేశాడు. ప్రమాదవశాత్తు పైపులకు నిప్పంటుకుని మంటలు చెలరేగడంతోపాటు పొగ ఊరు మొత్తం వ్యాపించింది. వెంటనే యువకలు స్వచ్ఛందంగా తరలివచ్చి మంటలను అదుపులోకి తేవడంతో ప్రమాదం తప్పింది.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

'తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి'

పోచమ్మమైదాన్, నవంబర్ 21: ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలంటే కష్టపడి చదవాలని శ్రీమేధా కళాశాల నిర్వాహకులు అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రతినిధులు సతీశ్‌కుమార్, అయినా కార్తీక్‌గౌడ్, అయినా స్వప్న, ప్రిన్సిపాల్, సెక్రటరీ అయినా కొయ్యడి వీరన్న గౌడ్, డైరెక్టర్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

గీసుగొండ, నవంబర్ 21: కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు స్వామి వారి పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు కాండూరి రామాచార్యులు తెలిపారు.